క్లుప్తంగా

నియామకం


దేవయ్య


మధుసూదన్

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన సాయిరి దేవయ్య పెరిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా, వంగల మధుసూదన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. నమ్మకంతో పదవుల్లో నియమించినందుకు పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దా లింగన్న, జిల్లా అధ్యక్షుడు గాండ్ల చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బస్వ వెంకన్నకు దేవయ్య, మధుసూదన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతోత్సవ కమిటీ


నూతన కమిటీ సభ్యులు

హుజూరాబాద్: బాబు జగ్జీవన్‌రామ్ జయంతోత్సవ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వేల్పుల రత్నం, గౌరవ సలహాదారులుగా బత్తుల రాజలింగం, వేల్పుల ప్రభాకర్, అధ్యక్షుడిగా రొంటాల సుమన్, ఉపాధ్యక్షులుగా ఎర్ర కుమార్, గాజుల సంపత్, ప్రధాన కార్యదర్శి మిడిదొడ్డి సుధాకర్, ప్రచార కార్యదర్శిగా డాక్టర్ తడికమళ్ల శేఖర్, కార్యదర్శులుగా మిడిదొడ్డి రాజు, మొలుగు శ్రీధర్, రామగిరి సంపత్, కోశాధికారిగా కనకం వెంకటస్వామి, సాంస్కృతిక కార్యదర్శిగా రామ్‌రాజేశ్వర్ నియామకమయ్యారు.

యువతి వివాహానికి ఆర్థికసాయం


వధూవరులను ఆశీర్వదిస్తున్న దాతలు

చొప్పదండి: పట్టణంలోని నిరుపేద పద్మశాలీ కుటుంబానికి చెందిన సాంబారి కావ్య వివాహానికి దాతలు విరాళం అందించారు. పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో రూ.88 వేలు, చొప్పదండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు రూ.20 వేలు సేకరించి యువతి కుటుంబ సభ్యులకు అందజేశారు. రామకృష్ణ సేవా సమితి సభ్యులు చేయూత అందించారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలీ సంఘాల సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, రామకృష్ణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం


రమేశ్, రాజును సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా రమేశ్, లైబ్రరీ సెక్రెటరీగా అప్పని రాజులు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా బుధవారం పెరిక సంఘం నాయకులు రమేశ్, రాజును సన్మానించారు. కార్యక్రమంలో పెరిక సంఘం నాయకులు పోతరాజు శ్రీనివాస్, అంకతి శ్రీనివాస్, భారత ప్రభాకర్, ఆకుల వెంకటరాజం, భారత రజనీకాంత్, మహేందర్, సందెల వెంకన్న, ముక్కెర కనకయ్య, పోతరాజు వీరయ్య, కుమారస్వామి, ప్రవీణ్, ఉగ్గె పరమేశ్వర్, కోన జయంత్, అచ్చె బాలకృష్ణ, పత్తిపాక విజయభాస్కర్, బండి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

మానకొండూర్: ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు ఎండలో పనిచేస్తున్నారని నీడ, నీరు సౌకర్యంతోపాటు పని ప్రదేశంలో మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. కూలీలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే ఊరుకోబోమన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చేగుర్తి, మొగ్దుంపూర్, చామనపల్లి, నగునూరు గ్రామాల్లోని ఐదు ఎరువుల దుకాణాలను బుధవారం డీఏవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువుల నిల్వ, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈనెల 1 నుంచి కొత్త స్టాక్ రిజిస్టర్లను డీలర్లు నిర్వహించాలని సూచించారు. ప్రతీ డీలరు కొత్తగా స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్‌లను మండల వ్యవసాయాధికారితో సర్టిఫికేషన్ చేయించుకోవాలని అన్నారు. డీఏవో వెంట ఏవో బి.సత్యం ఉన్నారు.

పంట పండినట్టే..!

- వరదకాలువలోకి నీటి విడుదల
- ఎండిపోతున్న పంటలకు ఊపిరి
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు
- మూడువేల ఎకరాల్లో వరిసాగు


వరదకాలువలో ప్రవహిస్తున్న నీరు

గంగాధర: వరదకాలువకు నీటిని విడుదల చేయడంతో ఎండిపోతున్న పంటలకు ప్రాణం వచ్చినట్టయిందని వరదకాలువ దిగువ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరదకాలువలో చుక్కా నీరులేకుండా పోవడంతో కాలువ ఆధారంగా మూడువేల ఎకరాల్లో వరి సాగు చేసిన రైతులు ఆందోళనకు గురయ్యారు. కాలువలోకి నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని పాలకులు, అధికారులను వేడుకున్నారు. అయినా సమస్యపై స్పందన లేకపోవడంతో రైతులు ఆందోళనకు సిద్ధం కాగా నీటిని విడుదల చేయిస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు. మండలంలోని షానగర్ సమీపంలోని గేట్లు ఎత్తి అక్కడ నిల్వ నీటిని విడుదల చేసినా నీరు కిలోమీటరు కూడా పారకపోవడంతో పంటపొలాలకు నీరందలేదు. దీంతో రైతులు మరోసారి రాస్తారోకో నిర్వహించారు. ప్రతిపక్షాలు సైతం రైతులకు అండగా నిలిచాయి. బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు వరదకాలువలోకి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి కురిక్యాల సమీపంలోని వరదకాలువపై వేర్వేరుగా ధర్నా నిర్వహించారు. సమస్యపై స్పందించిన పాలకులు మండలంలోని గాయత్రి పంప్‌హౌజ్ నుంచి రెండు రోజుల క్రితం నీటిని వరదకాలువలోకి విడుదల చేశారు. నీటి విడుదలతో వరి సాగు చేసిన కొండన్నపల్లి, కురిక్యాల, తాడిజర్రి, రంగరావుపల్లి, గర్శకుర్తి గ్రామాలతో పాటు బోయినపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లేదంటే సుమారు వెయ్యి ఎకరాల్లోని వరిపంట ఎండిపోయేదన్నారు.

ఏడెకరాలు ఎండేది



వ్యవసాయబావితో పాటు వరదకాలువ ఆధారంగా ఏడెకరాల్లో వరి సాగు చేశాను. వరదకాలువ ఎండి పోవడంతో బావిలో ఊట తగ్గింది. పొట్టదశలో ఉన్న వరికి నీరు కరువైంది. కాలువలోకి నీరు రావడంతో వరి పంట పండినట్టే, లేకుంటే ఏడెకరాల్లో పంట ఎండేది.

– రెండ్ల ఆంజనేయులు, రైతు, కొండన్నపల్లి

సంతోషంగా ఉంది



వరదకాలువ ఆధారంగా వేల ఎకరాల్లో వరి సాగైంది. కొద్ది రోజుల క్రితం వరదకాలువలో నీరుంది. పంట పొట్ట, గొలక దశలో ఉండగా కాలువలో నీరెండిపోయింది. నీటి కోసం ఆందోళన చేశాం. ఎట్టకేలకు వరదకాలువకు నీరు విడుదల చేశారు. సంతోషంగా ఉంది.

– తొరికొండ కిషన్, రైతు, కొండన్నపల్లి

ఘనంగా ఎల్లమ్మతల్లి పట్నాలు


శ్రీనివాస్‌నగర్‌లో ఎల్లమ్మ పట్నాల్లో భక్తులు

మానకొండూర్‌రూరల్: మండలంలోని మానకొండూర్, శ్రీనివాస్‌నగర్, జగ్గయ్యపల్లి, సదాశివపల్లి గ్రామాల్లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ జాతరలో చివరి రోజు బుధవారం అమ్మవారి పట్నాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ప్రణవ్


మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

వీణవంక: మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న రేణుకాఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ బుధవారం హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రహరీ, విద్యుత్ సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు పాడిపంటలు, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్ల కొండాల్‌రెడ్డి, పంజాల సతీశ్, చింతల శ్యాంసుందర్‌రెడ్డి, ఎండీ సాహెబ్ హుస్సేన్, కోమాల్‌రెడ్డి, ఎడెల్లి సురేందర్‌రెడ్డి, వీరేశం, నల్లగోని శ్రీనివాస్, పూదరి రాజేందర్, మంద రామస్వామి, నారాయణ, సమ్మయ్య, మల్లయ్య, అఖిల్ తదితరులు ఉన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


చొక్కారావుపల్లెలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్‌రావు


సైదాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో శ్రీధర్

గన్నేరువరం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని చొక్కారావుపల్లె, యాస్వాడ, చాకలివానిపల్లె, మాదాపూర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో కేడీసీఎంఎస్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. దళారులను ఆశ్రయించకుండా రైతులకు మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో కేంద్రాల ఇన్‌చార్జీలు అటికం తిరుపతిగౌడ్, భూమాడి శ్రీధర్ రెడ్డి, స్థానిక నాయకులు, ఆయా గ్రామాల రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

సైదాపూర్: వెన్కెపల్లి విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం సీఈవో శ్రీధర్ ప్రారంభించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున పాలకవర్గంతో కాకుండా సిబ్బందితో పెరుకపల్లి, ఎలబోతారం రాంచంద్రాపూర్, రాములపల్లి, ఎల్లంపల్లి, గుజ్జులపల్లి, గొడిశాల, గుండ్లపల్లి, ఘనపూర్ గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం సిబ్బంది, రైతులు ఉన్నారు.

రైతులకు పదిశాతం డివిడెండ్

చొప్పదండి: చొప్పదండి పీఏసీఎస్‌లో 2021–22 ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు పొందిన 1,099 మంది సంఘం సభ్యులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన మూడు శాతం వడ్డీ రాయితీని రైతుల ఖాతాల్లో జమ చేశామని పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి తెలిపారు. అలాగే సంఘం వార్షికోత్సవం సందర్భంగా పది శాతం డివిడెండ్‌ను ప్రకటించిన మేరకు రైతులకు సుమారు రూ. 22.33 లక్షలు 3,081 మందికి జమ చేశామన్నారు. సంఘం అభివృద్ధికి సహకరిస్తున్న రైతులు, పాలకవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చొప్పదండి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎంవో పద్మావతి, జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యం పూర్తిగా ఆరబెట్టి కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి మల్లేశం, పీఏసీఎస్ సీఈవో క్లెం తిరుపతిరెడ్డి, మల్లికార్జున్, శ్రీనివాస్, రమేశ్, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి


రామడుగు: కేంద్ర బలగాలు, పోలీసుల కవాతు


వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రవి, పోలీసులు

రామడుగు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని దేశరాజ్‌పల్లి, ఔదర్‌పల్లి గ్రామాల్లో బుధవారం సాయంత్రం కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రామడుగు ఎస్సై సురేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాగా కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి దేశరాజ్‌పల్లి స్టేజీ వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

జమ్మికుంట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా పట్టణంలోని వీణవంక రోడ్డులో కాకతీయ స్కూల్ సమీపంలో టౌన్ సీఐ వరగంటి రవి, కేంద్ర బలగాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రంకెన్‌డ్రైవ్, నెంబర్‌ప్లేట్ లేని వాహనాలు, త్రిబుల్ రైడింగ్, అనుమానాస్పద వాహనాలను పరిశీలించారు.

రైతులపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు

హుజూరాబాద్: రైతులపై కాంగ్రెస్ కపట ప్రేమ చూపుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో మాట్లాడుతూ.. సాగునీరు లేక పంటలను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలన్నారు. రైతులతోపాటు రైతు కూలీలు, భూమిలేని వారికి బీమా పథకం వర్తింపజేయాలన్నారు. హైదరాబాద్ అసెంబ్లీ ప్రబారి డాక్టర్ విజయ చందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు, జిల్లా కార్యదర్శి కరుణాకర్, జిల్లా అధికార ప్రతినిధి మాసాడి ముత్యంరావు, నరసింహారాజ్, ఆకుల రాజేందర్, రాజు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో అన్యాయం

తిమ్మాపూర్: మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ఆరోపించారు. రైతులకు మద్దతుగా ఉండాలనే పార్టీ పిలుపుమేరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా తిమ్మాపూర్ మండల కేంద్రంలో నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలుచేయలేదని విమర్శించారు. రెండు లక్షల రుణ మాఫీ ప్రకటనలు చేస్తూనే రైతులకు బ్యాంకులు ద్వారా నోటీసులు పంపించడం దారుణమన్నారు. పెట్టుబడి సాయం పెంపు, వరికి బోనస్ ఏమైందని ప్రశ్నించారు. కొలు రైతులకు పెట్టుబడి సాయంపై మాట్లాడటం లేదని, రైతులకిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంపీ బండి సంజయ్ చేసిన దీక్షతో పార్లమెంట్ పరిధిలోని రైతులు మద్దతుగా ఉన్నారని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బండి సంజయ్‌పై ఆరోపణలు చేస్తూ స్థాయిని తగ్గించుకుంటున్నారని విమర్శించారు. కరీంనగర్‌లో పోటీ చేసే ధైర్యం లేక హుస్నాబాద్ వెళ్లి పోటీ చేసి స్థానిక కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేశాడని, కరీంనగర్ అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు చర్చించే దమ్ముందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతుల పక్షాన ప్రభుత్వం ఆలోచన చేసి వెంటనే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ జోగిరెడ్డి, మాజీ ఎంపీపీ రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కళ్యాణ్‌చంద్ర, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మహిపాల్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమురయ్య, తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల అధ్యక్షులు జగదీశ్వరాచారి, ప్రవీణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు అనిల్, తిరుపతిరెడ్డి, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

సాగు, తాగునీరుపై ప్రభుత్వానికి పట్టింపులేదు

చొప్పదండి: సాగు, తాగునీరుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపులేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. చొప్పదండి నియోజకవర్గ ప్రజలు సాగు, తాగు నీటికోసం అల్లాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. పట్టణంలో బుధవారం మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమల్లో ప్రభుత్వం విఫలమైందని, ఎస్సారెస్పీ పరిధిలో పంటలు ఎండిపోతున్నాయని, ఎకరానికి రూ. 25 వేల పరిహారం అందించాలని, ఎల్లంపల్లి నీళ్లతో చెరువులు, కుంటలు నింపాలని కోరారు. సమావేశంలో శ్రావణ్, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, ప్రశాంత్, సుదర్శన్‌రెడ్డి, అశోక్, నేరెళ్ల శ్రావణ్, కుమార్, వెంకటరమణ, సుధాకర్, అనూశ్, సంపత్ పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రం ఆవిష్కరణ


హుజూరాబాద్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న శంకర్, బాబు, దశరథం,కనకయ్య, సత్యం తదితరులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో బుధవారం మాల మహానాడు ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కడారి శంకర్ మాట్లాడారు. జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8వ తేదీ వరకు రాజ్యాంగ రక్షణ యాత్ర జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సొల్లు బాబు, దశరథం, గూడ కనకయ్య, దామర సత్యం, తొగరు స్వామి, జూపాక శ్రీనివాస్, నరసింహం, నీరటి శ్రీనివాస్, ముక్క రఘుపతి, కాయిత రాము తదితరులు పాల్గొన్నారు.


శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో బుధవారం రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని మాల మహానాడు నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 5న కరీంనగర్‌లో నిర్వహించే సమావేశానికి తరలిరావాలని మండల అధ్యక్షుడు కత్తరమల్ల కిష్టస్వామి కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, కనకయ్య, వెంకటేశ్, అర్జున్, రాజు, వెంకటస్వామి పాల్గొన్నారు.


కేశవపట్నంలో కిష్టస్వామి,కనకయ్య తదితరులు

'హామీల అమలుకు ఆగమవుతున్నారు'

గంగాధర: అమలు చేయని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ అంటేనే అబద్ధాలపుట్ట అని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. మండలంలోని మధురానగర్‌చౌరస్తాలో బీఆర్‌ఎస్ మండల పార్టీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదనే ఉద్దేశంతో అడ్డగోలుగా హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక అమలు చేయడానికి ఆగమవుతున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, ఎంపీపీ శ్రీరాం మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి తాళం



వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం అద్దె చెల్లించడంలేదని ఇంటి యజమాని భవనానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కొమ్ము శ్యాంసన్‌కు చెందిన భవనాన్ని ఆరోగ్య ఉపకేంద్రానికి నెలకు రూ.2వేల చొప్పున అద్దెకిచ్చాడు. గత ఆరు నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో యజమాని కుటుంబసభ్యులు బుధవారం తాళం వేశారు. అద్దె చెల్లించేదాకా తాళం తీసేది లేదని స్పష్టం చేశారు. దీంతో విధులకు వచ్చిన సిబ్బంది వెనుదిరిగారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పోటీల్లో సాధించిన పతకాలు, బెల్టులతో విద్యార్థులు

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తా సురభి కాన్వెంట్ హైస్కూల్, మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయం విద్యార్థులు బుధవారం కరాటే ప్రతిభా పోటీల్లో పాల్గొని పతకాలు, బెల్టులు సాధించారు. అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ కరీంనగర్‌వారు నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్టుల్లో సురభి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అసోషియేషన్ అధ్యక్షుడు సంపత్‌కుమార్ బెల్టులు ప్రదానం చేశాడు. ఒకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వివేకానంద విద్యాలయం విద్యార్థులు పాల్గొని వివిధ బెల్టులు సాధించారు. కార్యక్రమాల్లో లక్ష్మారెడ్డి, ఉషారాణి, వీరనర్సయ్య, సీహెచ్ రాజేందర్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత


సర్టిఫికెట్లు అందిస్తున్న ఏఎస్సై విజయమణి

తిమ్మాపూర్: మండలంలోని నేదునూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీమ్ ఇన్‌చార్జి ఏఎస్సై విజయమణి, డబ్ల్యూపీసీ పుష్పలత సైబర్ అంబాసిడర్‌పై బుధవారం అవగాహన కల్పించారు. విజయమణి హాజరై మాట్లాడారు. 18 సంవత్సరాలలోపు వారికి వాహనాలు ఇవ్వొద్దని, మహిళలు, అమ్మాయిలు ఏ సమస్య ఉన్నా 8712670759 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ చేయాలని సూచించారు. సైబర్ అంబాసడర్ ప్లాట్‌ఫామ్‌లో అంబాసిడర్ కోర్సు పూర్తి చేసిన ఎస్. అరుణ్, ఎం.శ్వేత, అఖిల, సృజనకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మణరావు, టీచర్లు పద్మ, అనీఫ్ ఫాతిమా, ప్రభాకర్ పాల్గొన్నారు.